సాక్షి
సంగారెడ్డి
శనివారం । 10 । ఫిబ్రవరి । 2024



అర్చకులపై అలుసేలా?

అర్చకుల కోసం ప్రవేశపెట్టిన డీడీఎన్ పథకం లక్ష్యం నీరు గారిపోతోంది.

వివరాలు 8లో ▸



కూడవెల్లి.. భక్తుల సందడి

కూడవెల్లి రామలింగేశ్వర స్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు.

వివరాలు 8లో ▸



చేతి వృత్తులకు చేయూత

కేంద్రం చేతి వృత్తిదారుల కోసం పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని అందు బాటులోకి తెచ్చింది. వివరాలు 9లో ▸

సరిహద్దులు దాటిన అక్రమం

- 'గూడెం'క్వారీ గుట్టురట్టు
- అనుమతులకు మించి తవ్వకాలు
- టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో వెల్లడి
- కలెక్టర్‌కు నివేదిక

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : అధికారాన్ని అడ్డుపెట్టుకుని మైనింగ్ కార్యకలాపాలకు పాల్పడిన పటాన్‌చెరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి క్వారీలో విస్తుపోయే అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. ఈ క్వారీలో ఇచ్చిన అనుమతులకు మించి తవ్వకాలు జరిగినట్లు టాస్క్‌ఫోర్స్ బృందాల క్షేత్ర పరిశీలనలో తేలింది. ఇక్కడ నిర్ణీత సరిహద్దులు దాటి సహజ సంపదను తోడేసినట్లు టాస్క్‌ఫోర్స్ బృందాల జాయింట్ ఇన్‌స్పెక్షన్‌లో ప్రాథమికంగా నిర్ధారణ అయింది.

జిల్లాలో కొన్నేళ్లుగా విచ్చల విడిగా కొనసాగిన మైనింగ్ అక్రమాలపై కాంగ్రెస్ సర్కార్ ఉక్కుపాదం మోపుతున్న విషయం విదితమే. కలెక్టర్ వల్లూరు క్రాంతి నేతృత్వంలో ఐదు టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. ఇన్నాళ్లు అడ్డూ అదుపులేకుండా ఏళ్ల తరబడి సాగిన మైనింగ్ దందాపై విచారణ చేపట్టింది. రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, మైనింగ్, పీసీబీ, పోలీసు శాఖల అధికారులతో కూడిన ఈ బృందాలు క్వారీల్లో తనిఖీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా గూడెం మధుసూదన్‌రెడ్డికి చెందిన మెస్సర్స్ సంతోష్ గ్రానైట్ అండ్ సాండ్ సప్లయ్ క్వారీని ఈనెల 3న అధికారులు సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఇందులో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి కోజర్ ఆర్డర్ (నెం.ఎస్‌ఆర్‌డీ–368/టీఎస్‌పీసీబీ/టీఎఫ్/హెచ్‌ఓ/ 2023–1940)ను 2023 మార్చి 10న జారీ చేసింది. తక్షణం మైనింగ్ కార్యకలాపాలను నిలిపివేయాల్సి ఉండగా, ఈ ఆర్డర్‌ను బేఖాతర్ చేస్తూ యథేచ్ఛగా తవ్వకాలు జరిపి అక్రమ రవాణా చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని సుమారు ఏడాది కాలంగా దోపిడీని కొనసాగించారు. దీంతో టాస్క్‌ఫోర్స్ బృందాలు ఈనెల 3న క్వారీని సీజ్ చేశారు. అనంతరం క్వారీ తవ్వకాలు ఏ మేరకు జరిగాయనే దానిపై క్షేత్రస్థాయి సర్వే నిర్వహించగా.. సరిహద్దులు దాటి సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో అక్రమ తవ్వకాలు జరిపారని తేలినట్లు సమాచారం. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు కలెక్టర్‌కు నివేదిక అందజేశారు.



గూడెం మధుసూదన్‌రెడ్డి మైనింగ్ క్వారీని సీజ్ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

అధికారులకు ఇన్నాళ్లు 'మామూళ్లే..'

క్వారీల్లో తవ్వకాలను రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. కానీ ఈ రెండు శాఖల అధికారులు క్వారీ వైపు కన్నెత్తి చూడలేదు. ఎంత విస్తీర్ణంలో తవ్వకాలు జరుపుతున్నారనేది పట్టించుకోలేదు. అధికారులకు ప్రతినెలా రూ.లక్షల్లో ముడుపులు అందడంతో బీఆర్‌ఎస్ నేత మైనింగ్ దందా ముప్పై జేసీబీలు.. మూడు వందల టిప్పర్లలా సాగింది.

అధికారాన్ని అడ్డం పెట్టుకుని..

గూడెం మధుసూదన్‌రెడ్డి తన సోదరుని అధికారాన్ని అడ్డం పెట్టుకుని పటాన్‌చెరు మండలం లక్డారంలోని సర్వే నెం.738లో 4.23 హెక్టార్లలో క్వారీ తవ్వకాల కోసం భూగర్భ గనుల శాఖ నుంచి అనుమతులు తీసుకున్నారు. ఇక్కడ జరిగిన అక్రమ మైనింగ్‌తో లక్డారం గ్రామంతో పాటు, చుట్టుపక్కల పదుల సంఖ్యలో గ్రామాల వాసులు పడరాన్ని పాట్లు పడ్డారు. క్వారీ నుంచి నిత్యం అక్రమ రవాణాతో రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. మోకాళ్ల లోతు గుంతలు పడ్డాయి. తవ్వకాలతో వచ్చిన దుమ్ముతో పచ్చని పొలాలన్నీ పాడయ్యాయి. సమస్యలపై కొన్నేళ్లుగా లక్డారం వాసులు అధికారులకు లెక్కలేనన్ని సార్లు ఫిర్యాదు చేశారు. ప్రజాఫిర్యాదుల విభాగంలో పలుమార్లు వినతి పత్రాలు అందజేశారు. అప్పట్లో అధికార పార్టీ నేత కావడంతో అధికారులు ఈ అక్రమ దందా వైపు కన్నెత్తి కూడా చూడలేదు. నెల నెలా మామూళ్లు తీసుకున్న సంబంధిత శాఖల అధికారులు స్థానికుల గోడు కనీసం పట్టించుకోలేదు.

కలెక్టర్‌కు నివేదిక



లక్డారంలోని సంతోష్ గ్రానైట్ అండ్ సాండ్ సప్లయ్ క్వారీలో ఇచ్చిన అనుమతులకు కంటే సరిహద్దులు దాటి అక్రమ తవ్వకాలు జరిగినట్లు ఫిర్యాదులున్నాయి. ఇటీవలే సర్వే నిర్వహించాం. కలెక్టర్‌కు నివేదిక ఇస్తున్నాం. రెండు రోజుల్లో పూర్తి వివరాలను వెల్లడిస్తాం. ఇప్పటికే ఈ క్వారీని సీజ్ చేశాం. మిగిలిన క్వారీలను కూడా సర్వే చేస్తున్నాం.

– రవీందర్‌రెడ్డి, ఆర్డీఓ సంగారెడ్డి

నంబర్‌గేమ్..!

- అమీన్‌పూర్‌లో దొంగ ఇంటి నంబర్లతో గదుల నిర్మాణం
- ఏం చేయలేకపోతున్న రెవెన్యూ అధికారులు
- అవి తప్పు నంబర్లంటూ మున్సిపల్ అధికారులు
- అసైన్డ్, ప్రభుత్వ భూములపై దళారుల దందా



కబ్జా చేసి నిర్మించిన ఇంటికి నంబర్లు

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గంలో భూముల ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. నగర శివారు ప్రాంతం కావడంతో ఇక్కడ ఇంటి స్థలాలకు పెద్ద ఎత్తున డిమాండ్ ఉంది. అంతేకాకుండా ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున అసైన్డ్, ప్రభుత్వ భూములు ఉన్నాయి. వీటిని కొందరు దళారులు పెద్దల అండదండలతో ఆక్రమించుకుంటున్నారు. వాటిని నోటరీ పేరుతో అమ్ముకుని కోట్లు దండుకుంటున్నారు.

పటాన్‌చెరు నియోజకవర్గ పరిధి అమీన్‌పూర్ లో ప్రభుత్వ, అసైన్డ్, దేవాదాయ, చెరువు భూములు కబ్జాకు గురవుతున్నాయి. ఈ దందా మున్సిపల్ అధికారులకు తెలిసే జరుగుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. కబ్జా చేసిన స్థలాల్లో నిర్మాణాలు చేపట్టి అడ్డదారిలో ఇంటి నంబర్లు సైతం తెచ్చుకుంటున్నారని తెలుస్తోంది. ఆక్రమించిన స్థలంలో రాత్రికి రాత్రి రూములు నిర్మించి ఏదో ఒక ఇంటి నంబర్లు గోడలపై రాసి ఉంచుతున్నారు. వీటిని చూసి అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. కొత్తగా ఎలాంటి ఇంటి నంబర్లు ఇవ్వడం లేదని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు.

అమీన్‌పూర్‌లో అనేక చోట్ల ఇంటి నంబర్లను వేసి అక్రమ పద్ధతిలో ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారు. పట్టణంలోని నర్రెగూడెం వీకర్ సెక్షన్ కాలనీ వెనుక భాగంలో ఆక్రమణలు జరుగుతున్నాయి. ప్రముఖ పార్టీలకు చెందిన నాయకుల అండదండలతో అక్రమాలు సాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఆక్రమించిన స్థలాలకు పట్టాలు కూడా ఉన్నాయని కొందరు దబాయిస్తుండటం గమనార్హం. తాజాగా గోశాల పక్కన ఆస్పత్రికి కేటాయించిన స్థలంలో అనుమతి లేకుండా గదుల నిర్మాణం చేపట్టారు. వాటిని కూల్చేందుకు వెళ్లిన అధికారులకు స్థానికుల నుంచి బెదిరింపులు వచ్చాయి. చాలాకాలంగా ఇక్కడే ఉంటున్నామని, ఇంటి నంబర్లు కూడా ఉన్నాయని చెబుతున్నారు. దాంతో అధికారులు ఏమీ చేయలేక వెనుదిరుగుతున్నారు. ఎస్‌ఆర్‌ఐ కాలనీ వెళ్లే దారిలో ఈద్గా దగ్గర, చర్చి వెనుక వివాదాస్పద స్థలంలోని ఓ ప్లాట్‌లో చిన్న గది నిర్మించి దానికి ఇంటి నంబర్‌ను పొందారు. అది ప్రభుత్వ భూమి అని స్థానికులు వాదిస్తున్నారు. అమీన్‌పూర్ శివారు ప్రాంతాల్లోని గ్రామాల భూములను కూడా కబ్జా చేసి వాటికి మున్సిపల్ ఇంటి నంబర్లను రాస్తున్నారు. వాస్తవాలు ఏమైనా కబ్జాలను అడ్డుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఆక్రమణలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమార్కుల సృష్టే



ఇంటి నంబర్లను నిబంధనల మేరకే ఇస్తారు. కబ్జాలకు ఇవ్వడం లేదు. సబ్ రిజిస్ట్రార్‌కు కూడ లేఖలు పంపాం. కొత్తవి ఇవ్వడం లేదు. తప్పుడు నంబర్ల వేసి కబ్జాలు చేస్తున్నారు. వారి పై చర్యలు తీసుకుంటాం

– జ్యోతిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, అమీన్‌పూర్

న్యూస్‌రీల్

విత్తనోత్పత్తితో అధిక లాభాలు



పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

కోహీర్(జహీరాబాద్): మొక్కజొన్న విత్తనోత్పత్తితో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు రైతులకు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని సజ్జాపూర్ గ్రామ శివారులోని మొక్కజొన్న, అల్లం, బొప్పాయి, చెరుకు పంటలను పరిశీలించారు. సేంద్రియ పద్ధతుల్లో సాగు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు భిక్షపతి, మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్, వ్యవసాయ విస్తీర్ణాధికారి మౌనిక, పంచాయతీ కార్యదర్శి అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహులు, రైతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ బాటిళ్లలో పెట్రోల్ పోయొద్దు

ఎస్పీ రూపేష్

సంగారెడ్డి : పెట్రోలియం యాక్ట్ 2002 ప్రకారం ప్లాస్టిక్ బాటిల్స్, క్యాన్లలో పెట్రోల్ పోయొద్దని ఎస్పీ రూపేష్ బంక్ యజమానులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. వాహనాల ట్యాంకుల్లో మాత్రమే పెట్రోల్ పోయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు బాటిళ్లలో పెట్రోల్ పోయించుకుని అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఎవరైనా బలవంత పెడితే పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతీ బంక్‌లో క్వాలిటీ సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి హనుమంతరావు

సంగారెడ్డి టౌన్ : బాలల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. శుక్రవారం కంది మండలంలోని ఐఐటీ హైదరాబాద్‌లోని డీపీఎస్ పాఠశాలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. వేధింపుల కేసులకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ అశోక్ కుమార్, డీడబ్ల్యూఓ సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్: పది, ఇంటర్ పరీక్షలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో కస్తూర్బా బాలికల విద్యాలయాల ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. వసతి గృహాల్లో ఆరోగ్యం, భోజనంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు.

చైర్‌పర్సన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- పదవి కోల్పోయిన చైర్‌పర్సన్ జయమ్మ
- పంతం నెగ్గించుకున్న 22మంది కౌన్సిలర్లు
- మళ్లీ బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌కే చాన్స్



అవిశ్వాసం నెగ్గినట్లు ప్రకటిస్తున్న ప్రిసైడింగ్ అధికారి రవీందర్‌రెడ్డి

సదాశివపేట(సంగారెడ్డి): బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో ఆమె పదవి కోల్పోవాల్సి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆమెపై సొంత పార్టీ కౌన్సిలర్లతోపాటు కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం కౌన్సిలర్లు అవిశ్వాసాన్ని ప్రతిపాదిస్తూ జనవరి 18వ తేదిన అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు నోటీస్ అందజేశారు. ఫిబ్రవరి 9న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి జనవరి 22న ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీఓ రవీందర్‌రెడ్డి శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానం ప్రక్రియ చేపట్టారు. మున్సిపల్‌లో మొత్తం 26మంది కౌన్సిలర్లు ఉండగా, 22 మంది సమావేశానికి హాజరయ్యారు. చైర్ పర్సన్‌తో పాటు ఆమె కుమారుడు పిల్లోడి విశ్వనాథం, కాంగ్రెస్ కౌన్సిలర్ పరంజ్యోతి, బీజేపీ కౌన్సిలర్ పులిమామిడి రాజు సమావేశానికి హాజరు కాలేదు. 18 మందితో కోరం ఉండటంతో ఆర్డీఓ ఉదయం 11గంటలకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. చైర్‌పర్సన్ జయమ్మను తొలగించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని 22 మంది కౌన్సిలర్లు చేతులు ఎత్తారు. దీంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీఓ ప్రకటించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తహసీల్దార్ సరస్వతి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

గెజిట్ నోటిఫికేషన్ తర్వాతే..

అవిశ్వాసం నెగ్గిన వివరాలను కలెక్టర్ వల్లూరి క్రాంతికి ఆర్డీఓ నివేదించనున్నారు. ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాతే కొత్త చైర్మన్ ఎన్నిక ప్రక్రియ చేపట్టనున్నారు. 26వ వార్డు కౌన్సిలర్ అపర్ణ కొత్త చైర్ పర్సన్‌గా ఎన్నుకునే అవకాశాలున్నాయి.

సింగూరుకు నిధులొచ్చేనా?

పుల్‌కల్(అందోల్) : తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. శనివారం రాష్ట్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఈ బడ్జెట్‌లో జిల్లాలోని భారీ నీటి పారుదల ప్రాజెక్టు సింగూరు ప్రాజెక్టుకు నిధుల కేటాయింపుపై ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఈ ప్రాజెక్టు పరిధిలో 15ఎంయూ విద్యుత్ ఉత్పత్తితోపాటు 40 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. మూడు మండలాలలో 145 చెరువుల్లోకి కాలువల ద్వారా నీటిని తరలిస్తారు. దీంతో రైతులు రెండు పంటలు పండిస్తారు.

ఏటా ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నా డ్యాం వద్ద ఎలాంటి మరమ్మతులు చేపట్టడం లేదనే విమర్శలున్నాయి. కట్టపై రెండు దశాబ్దాల క్రితం వీధిలైట్లను ఏర్పాటు చేశారు. వీటిలో ఎక్కువ భాగం ప్రస్తుతం పాడయ్యాయి. అంతే కాకుండా పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరిగాయి. ప్రాజెక్టుపై మెయింటెనెన్స్ పనులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. సింగూరు ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో గత ప్రభుత్వం బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తి పోతల పథకాలను ప్రవేశపెట్టినా అవి ఆచరణకు నోచకపోవడంతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. ఆ స్థానంలో ఎగువ భాగంలో బ్యాక్ వాటర్‌ను వినియోగించుకోవడానికి పుల్‌కల్ మండలం మంతూరు వద్ద నూతనంగా మరో ఎత్తి పోతల పథకంను రూపొందిస్తున్నారు. దీనికి ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపు ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



- నేటి బడ్జెట్‌పై జిల్లావాసుల గంపెడాశలు
- ప్రాజెక్టు నిర్వహణ అస్తవ్యస్తం
- నిధులు కేటాయించి మర్మతులు చేపట్టాలంటున్న ప్రజలు

నియోజకవర్గంలో సమస్యల తిష్ట

జోగిపేట(అందోల్): అందోల్ అసెంబ్లీ నియోజవర్గంలో అందోల్, వట్‌పల్లి, రాయికోడ్, మునిపల్లి, పుల్కల్, చౌటకూర్ మండలాల పరిధిలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ప్రధానంగా చిల్వర ఐబీ నుంచి రాయికోడ్ చౌరస్తా వరకు ఉన్న ప్రధాన రహదారి పరిస్థితి దయనీయంగా ఉంది. అలాగే అందోల్ చెరువు నుంచి జోగిపేట మీదుగా వెళ్లే కట్టుకాలువ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. అందోల్ పెద్ద చెరువు సుందరీకరణ పనులకు నిధులు మంజూరై ఏడేళ్లు కావొస్తున్నా ఇప్పటికీ పూర్తి కాలేదు. సింగూరు ప్రాజెక్టు నుంచి అందోల్, పుల్కల్ ప్రాంతాలలోని చెరువులకు నీటిని తరలించే కాల్వలకు రివీట్‌మెంట్ చేయక కాలువలు దెబ్బతిన్నాయి. పెద్ద చెరువు చుట్టు వాల్ నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు. జోగిపేట నాందేడ్ అకోలా రహదారిపై అన్నాసాగర్, సంగుపేట రోడ్డు వరకు డివైడర్‌ను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. అందోల్ ప్రాంతంలో పరిశ్రమను ఏర్పాటు చేస్తే పేదలకు ఉపాధి లభించే అవకాశం ఉంది. ఈ బడ్జెట్‌లో నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

చక్రియాల అభివృద్ధికి నిధులివ్వండి

సంగారెడ్డి : చౌటకూర్ మండలం చక్రియాల గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు మంత్రి దామోదరను కోరారు. శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసానికి వచ్చి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లక్ష్మీఅనంత పద్మనాభ స్వామి ఆలయానికి వెళ్లే దారిని సీసీగా మార్చాలని కోరారు. అలాగే ఆలయ నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేసేందుకు చొరవ చూపాలని విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో చిన్నరోళ్లపాటి రాజశేఖర్, భానూరి లక్ష్మణ్, బోడపట్ల ఆనందం, రోళ్లపాటి సత్యనారాయణ తదితరులున్నారు.

మంత్రి దామోదరను కలిసిన నాయకులు



మంత్రిని కలిసిన నాయకులు

ఎస్‌జీటీల సస్పెన్షన్

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని ముత్తంగి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్) సందీప్, నర్సింహులు సస్పెండ్ చేస్తున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈఓ ఇచ్చిన ప్రాథమిక నివేదిక ఆధారంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో అమర్యాదగా ప్రవర్తించారనే అభియోగంపై వీరిని సస్పెండ్ చేసినట్లు చెప్పారు.

క్షీరాభిషేకం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సంగారెడ్డి : మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నర్సింహారావుకు భారతరత్న ఇవ్వడం పట్ల బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆమె మాట్లాడారు. పీవీకి అత్యుత్తమ అవార్డు ఇచ్చిన సందర్భంగా మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మిఠాయిలు పంచారు. రాజశేఖర్ రెడ్డి, వెంకట నరసింహారెడ్డి, రాజు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు టౌన్: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శుక్రవారం రుద్రారంలోని ప్రకృతి వనాన్ని ఆమె సందర్శించారు. అక్కడ మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. గ్రామ పరిధిలోని రెస్టారెంట్లు, దాబాలు కంపోస్ట్ పిట్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్లాస్టిక్‌ను నిషేధించాలని, పేపర్, కాటన్ బ్యాగులు వాడాలని సూచించారు. అనంతరం రుద్రారం గణేష్ గడ్డ దేవాలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ మోహన్ రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, ఈశ్వర్ పాల్గొన్నారు.

- జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం(7) సెగ్మెంట్లకు అవసరమైన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్ల ఏర్పాటు కోసం రుద్రారం గీతం యూనివర్సిటీని కలెక్టర్ సందర్శించారు. అక్కడ గదులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

కలెక్టర్ క్రాంతి

ఆమెవెంట అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ మహిపాల్ రెడ్డి ఉన్నారు.

- కంది (సంగారెడ్డి): పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా కందిలోని పల్లె ప్రకృతివనాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడ ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. అలాగే జెడ్పీ పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత నిస్తోందన్నారు. పాఠశాలకు బోరు మంజూరు చేయాలని ప్రధానోపాధ్యాయురాలు వెంకటలక్ష్మీ విన్నవించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, సంధ్యారాణి, సతీష్ రెడ్డి, విశ్వప్రసాద్, ఉన్నారు.
- సంగారెడ్డి టౌన్ : మహాలక్ష్మి పథకంలో భాగంగా గ్యాస్ కనెక్షన్ల వివరాలు 10వ తేదీలోగా సరిచేయాలని కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులను ఆదేశించారు. అధిక అప్లికేషన్లు ఉన్నచోట ఎక్కువ లాగిన్స్ తీసుకోవాలన్నారు. ఎంపీడీఓలు క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. అందరి భాగస్వామ్యంతో పారిశుద్ధ్య నిర్వహణ, గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డిపిఓ సురేష్ మోహన్ పాల్గొన్నారు.

● కలెక్టరేట్ వద్ద ఆశాల ధర్నా



కలెక్టర్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

సంగారెడ్డి టౌన్ : ఆశా వర్కర్ల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ.. ఆశాలకు రెండు నెలలుగా వేతనాలు అందడం లేదని, వారు 18 ఏళ్లుగా పనిచేస్తున్నా నేటికీ ఉద్యోగ భద్రత కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా కష్ట కాలంలో పనిచేసిన రిస్క్ అలవెన్సులు కూడా ఇవ్వలేదన్నారు. అనంతరం డీఆర్ఓ నగేష్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, యశోద, వీరమణి, ప్రశాంతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు 12 మంది విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో అధికారి వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్: జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయికి 12 మంది విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. జిల్లా సైన్స్ కేంద్రంలో నాలుగు విభాగాల్లో పెయింటింగ్, కవిత్వం, పాటల పోటీలు, ఉపన్యాస పోటీలు నిర్వహించి ఇందులో జిల్లా స్థాయి నుంచి ఒక్కొక్క విభాగంలో ముగ్గురు చొప్పున 12 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 28న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించి, విజేతలకు అక్కడే ప్రశంసాపత్రాలు అందజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రెటరీ లింభాజీ, సైన్స్ ఆఫీసర్ పీ.సిద్దారెడ్డి, డాక్టర్ పూర్ణకృష్ణ, ఎన్‌జీసీ కో ఆర్డినేటర్ మాధవ రెడ్డి, అనీల్ కుమార్, వెంకటేశం ఎంపికైన వారికి జ్ఞాపికలను అందజేశారు.

మల్లన్న ఆలయ ఒగ్గు పూజారి కన్నుమూత



అయిలయ్య (ఫైల్)

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ఒగ్గు పూజారిగా సేవలు అందిస్తున్న బైరి అయిలయ్య(58) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి ఆలయ ధర్మకర్తలతో కలిసి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, ఆలయం నుంచి అందాల్సిన ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఒగ్గు పూజారుల సంఘం అధ్యక్షుడు బొద్దుల కనుకయ్య, రాములు, జింకల పర్వతాలు ధర్మకర్తలు మేడికుంట శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు మహాదేవుని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్
తీవ్ర గాయాలతో వ్యక్తి మృతి



జితేందర్ సాని

పటాన్‌చెరు టౌన్: బైక్‌ను టిప్పర్ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మల్లయ్య కథనం ప్రకారం.. బీహర్ రాష్ట్రానికి చెందిన జితేందర్ సాని(26), ఉపేందర్ సాని సోదరులు ఇద్దరూ బతుకుదెరువు కోసం ఆరేళ్ల కిందట అమీన్‌పూర్ పరిధిలోని లింగమయ్య కాలనీకి వచ్చి ఓబులేష్ అనే వ్యక్తి వద్ద సెంట్రింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం ఉదయం జితేందర్ సాని బైక్‌పై గోశాల నుంచి మల్లికార్జున నగర్ వైపు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన టిప్పర్ బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన జితేందర్‌ను చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి సోదరుడు ఉపేందర్ సాని మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అర్చకులపై అలుసేల?

దేవాలయాల్లో నిత్య పూజల నిర్వహణ కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ధూపదీప నైవేద్య (డీడీఎన్) పథకం లక్ష్యం నీరుగారిపోతుంది. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఈ పథకం కింద ఎంపిక చేసిన ఆలయాల్లో అర్చకులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వడం లేదు. ఏడు నెలలుగా జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. ఆలయాల్లో పూజలు నిరంతరం కొనసాగించేందుకు సరిపడా నిధులు లేక అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని అర్చకులు వాపోతున్నారు.

- పెద్దశంకరంపేట(మెదక్)



మంత్రి కొండా సురేఖకు సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న అర్చకులు

'కొత్త' అర్చకులకు అందని వేతనాలు

- ధూప, దీప నైవేద్య పథకం కింద 454 మందిని ఎంపిక
- ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా 459 ఆలయాలు
- ఏడు నెలలుగా తప్పని ఎదురుచూపులు
- భక్తుల సహకారంతోనే నిత్య పూజలు

గత ప్రభుత్వం పురాతన ఆలయాల పునరుజ్జీవానికి ధూప దీపనైవేద్య పథకం(డీడీఎన్ఎస్)ను తీసుకొచ్చింది. ఈ మేరకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ద్వారా రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధి తోపాటు ఎంపిక చేయబడిన డీడీఎన్ఎస్ అర్చకులకు రూ.6 వేల నుంచి రూ.10 వేల వేతనాన్ని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

459 ఆలయాలు గుర్తింపు..

దేవాదాయ, ధర్మాదాయ శాఖ 2009లో ప్రవేశపెట్టిన ధూపదీప నైవేద్య పథకం కింద అప్పట్లో నెలకు రూ.2500 వేతనంగా నిర్ణయించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత రూ.6 వేలకు పెంచారు. ఇందులో రూ.4 వేలు అర్చకుడి వేతనం, రూ.2 వేలు ఆలయ పూజ అవసరాలకు కేటాయించాలి. అప్పట్లో డీడీఎన్ఎస్ పథకం కింద ఉమ్మడి మెదక్ జిల్లాలో మొదటి విడతలో 100, రెండో విడతలో 278 ఆలయాలను గుర్తించారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా గతేడాది 459 ఆలయాలను



కమలాపూర్‌లోని హనుమాన్ దేవాలయం

డీడీఎన్ఎస్ పథకం కింద గుర్తించగా అర్చకులు దరఖాస్తు చేసుకున్నారు. మెదక్ జిల్లాలో 98, సంగారెడ్డి జిల్లాలో 190, సిద్దిపేట జిల్లాలో 171 ఆలయాలను గుర్తించి ధూపదీప నైవేద్య పథకంలో చోటు కల్పించారు. దరఖాస్తుల్లో ఎంపిక చేసి అర్చకులకు గతేడాది జూన్ 21న ఉత్తర్వులను అప్పటి ఎమ్మెల్యేల చేతుల మీదుగా అందించారు. దీంతో డీడీఎన్ఎస్ పథకం తమకు వరంగా మారిందని అర్చకులు భావించి, విధుల్లో చేరారు. అప్పటి నుంచి ఆలయాల్లో పూజలు చేస్తున్నారు.

454 మంది ఎదురుచూపులు..

నూతనంగా డీడీఎన్ఎస్‌లో చేరిన అర్చకులకు రూ.10 వేల వేతనాలు రావాల్సి ఉంది. పాత అర్చకులకు ఐదు నెలలకు సంబంధించి పెరిగిన రూ.10 వేల వేతనాన్ని అందించారు. కానీ కొత్తగా ఈ పథకంలో చేరిన 454 అర్చకులకు మాత్రం ఇప్పటికి నిరాశే మిగిలింది. ఏడు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో అర్చకులు అవస్థలు పడుతున్నారు. కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మ ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అర్చకులు వినతిపత్రాలు అందజేశారు. కొత్త ప్రభుత్వంలోనైనా తమకు వేతనాలు అందుతాయా అనే ఆశతో అర్చకులు ఎదురుచూస్తున్నారు.

ప్రతీ నెలా అందించాలి

డీడీఎన్ఎస్ పథకంలో నూతనంగా ఎంపికైన అర్చకులకు ప్రతీ నెలా వేతనాలను అందించాలి. గతేడాది జూన్ 21న తమను ఎంపిక చేస్తూ ఉత్తర్వులు అందించినా ఇప్పటి వరకూ ఒక్క నెల వేతనం కూడా అందలేదు. ఈ పథకంలో ఉన్నట్లా, లేనట్లా అనే సందేహం నెలకొంది. నూతన ప్రభుత్వం అర్చకుల సమస్యలను పరిష్కరిస్తూ పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలి. ఆలయ కైంకర్యాలకు నిధులు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– మహేశ్‌శర్మ, అర్చకుడు, పెద్దశంకరంపేట

త్వరలో అందుతాయి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ధూపదీప నైవేద్య పథకంలో పాత, కొత్త అర్చకులకు సంబంధించిన వేతనాలను విడుదల చేయాలని ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది. త్వరలో పాతవారితోపాటు కొత్త వారికి కూడా వేతనాలు అందజేస్తాం.

– శివరాజ్, ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్

ఆటంకాలు అధిగమించాలి

నర్సాపూర్: విద్యార్థులు తమకు ఎదురయ్యే ఆటంకాలను అధిగమించి ముందుకు సాగుతూ విజయాలు సాధించాలని నోవార్టిస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బయో మెడికల్ రీసెర్చ్ ట్రాన్స్‌లేషన్ మెడిసిన్ డైరెక్టర్ డాక్టర్ జగన్నాథ రావు కోట అన్నారు. విష్ణు ఫార్మసీ కాలేజీలో శుక్రవారం జరిగిన ఔషధ్–2024 ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇక్కడ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని, మంచి లేబరేటరీలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు హితవు పలికారు. ఇందులో భాగంగా విద్యార్థులకు పలు రకాల పోటీలు చేపట్టి విజేతలకు నగదు బహుమతులు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో యూఎస్‌ఏ కు చెందిన క్రాస్నో ఇనిస్టిట్యూట్ ఫర్ అడ్వాన్స్‌డ్ న్యూరో సైన్స్ ప్రతినిధి డాక్టర్ రామక్రిష్ణ మెదూరి, తైవాన్‌కు చెందిన బయోమెడికల్ డివైస్ గ్రాండ్ మార్యాస్ మార్కెటింగ్ స్పెషలిస్టు నాగలక్ష్మి, కాలేజీ ప్రిన్సిపాల్ రమేశ్, హెచ్‌ఓడీ వనిత, కాలేజీ అధ్యాపకులు జాహ్నవి, సంధ్య, నామిరా జాబిన్, ఫహియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ముఖ్య అతిథులు

చెత్తను సేకరిస్తూ మృత్యుఒడికి..
గుండెపోటుతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి



స్వామి (ఫైల్)

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేట గ్రామ పంచాయతీలో చెత్త సేకరించే ట్రాక్టర్‌పై తాత్కాలిక డ్రైవర్‌గా పని చేస్తున్న తుడుం స్వామి (52) శుక్రవారం విధి నిర్వహణలో ఉండగానే గుండెపోటుతో మృతి చెందాడు. ఉదయం గ్రామంలోని వార్డుల్లో తిరుగుతూ ట్రాక్టర్‌లో చెత్త సేకరిస్తున్న క్రమంలో స్వామి అస్వస్థతకు గురయ్యాడు. ఛాతీలో నొప్పితో విలవిలలాడి ట్రాక్టర్ ఆపివేసి కిందికి దిగి పడిపోయిన అతడిని చికిత్స నిమిత్తం రామాయంపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలున్నారు.

పరిశ్రమలో కార్మికుడు మృతి



కిషోర్(ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): ఓ పరిశ్రమంలో కార్మికుడు మృతి చెందిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన కిషోర్ (18) మూడు నెలల నుంచి మనోహరాబాద్ మండలం కాళ్లకల్ పరిశ్రమల వాడలో గల లివాన్ టెక్‌బాండ్ ఫోం పరిశ్రమలో పని చేస్తూ జీవిస్తున్నాడు. రోజు వారీగా పరిశ్రమలో పని చేస్తున్న కిషోర్ ప్రమాదవశాత్తు గదిలో ఉన్న దూది ఫోంలో పడిపోయాడు. ఎంతసేపటికీ తోటి కార్మికుడు రాకపోవడంతో గమనించిన కార్మికులు ఫోంలో వెతకగా ఊపిరాడక కోమాలోకి వెళ్లి కనిపించాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు. పరిశ్రమ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో దొంగతనం

ఇప్పటి వరకు ఆరుసార్లు చోరీ

జోగిపేట(అందోల్): జోగిపేటలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం (కోడ్ నం16)లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సాయత్రం 4 గంటలకు అంగన్‌వాడీ కేంద్రానికి టీచర్ తాళం వేసి వెళ్లింది. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి అందులోని 75 కేజీల బియ్యం, 6 కిలోల పప్పు, 14 నూనె ప్యాకెట్లు, 30 కిలోల బాలామృతం ప్యాకెట్లు ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం అంగన్‌వాడీ టీచర్ సావిత్రి కేంద్రానికి రాగా తలుపులు తెరిచి ఉన్నాయి. చోరీ జరిగినట్టు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ–2 మొగులయ్య సిబ్బందితో అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి విచారణ చేపట్టారు. సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మొగులయ్య తెలిపారు.



విచారణ జరుపుతున్న పోలీసులు

ఆరుసార్లు దొంగతనం..

ఇదే అంగన్‌వాడీ కేంద్రంలో ఇప్పటి వరకు ఆరుసార్లు దొంగతనం జరిగింది. ఫిర్యాదు చేసినా నిందితులను పోలీసులు గుర్తించలేదు. పాఠశాల ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారింది. వెనుక భాగాన ప్రహరీ చిన్నదిగా ఉండడంతో లోనికి ప్రవేశించి అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు.

మహిళ మెడలోంచి గొలుసు చోరీ

పటాన్‌చెరు టౌన్: మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ జరిగిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సదా నాగరాజ్ కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేట్ వెంకటరమణ కాలనీ చెందిన సావిత్రి తన మనువడు ఆధ్వేయను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో వదిలేందుకు శుక్రవారం ఉదయం నడుచుకుంటూ వెళ్తుంది. అదే సమయంలో ఎదురుగా బైక్ పై వచ్చిన ఇద్దరు యువకులు సావిత్రి మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. ఈ దృశ్యం సీసీ కెమెరాలో నమోదు కాగా, బాధితురాలి కుమారుడు నవీన్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మహిళ మెడలోంచి గొలుసు లాక్కెళ్తున్న దొంగలు

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సిద్దిపేటకమాన్: అక్రమంగా వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కొమురవెల్లి మండలం మర్రిముచ్చాలకు చెందిన మహిపాల్ చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు రైస్ మిల్‌కు విక్రయిస్తున్నాడు. నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు రైడ్ చేయగా అక్రమంగా టాటాఏస్ వాహనంలో 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. వాహనంతో సహా వ్యక్తిని టూ టౌన్ పోలీసులకు అప్పగించామన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రభుత్వ రేషన్ బియ్యం నిల్వ ఉంచినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

కూడవెల్లి.. భక్తుల సందడి

- రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు
- మాఘ అమావాస్య పర్వదినం

దుబ్బాకరూరల్: మాఘ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని కూడవెల్లి రామలింగేశ్వరస్వామిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శుక్రవారం ఉదయం నుంచి మొదలుకొని సాయంత్రం వరకు భక్తులు దైవ దర్శనం చేసుకుంటున్నారు. మాఘ అమావాస్య రోజు కూడవెల్లి వాగులో స్నానం చేస్తే సకల పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తుతో పాటుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జాతరలో రంగుల రాట్నం, చిన్నారులకు పలు రకాల మెజిక్స్‌లు ఏర్పాటు చేశారు. భక్తులకు సౌకర్యార్థం దుబ్బాక డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ఆలయ సిబ్బంది వలంటీర్లను ఏర్పాటు చేశారు. జాతర మూడు రోజుల వరకు సాగుతుంది. సిద్దిపేట జిల్లా ప్రజలే కాకుండా సరిహద్దు జిల్లాలైన నిజామాబాద్, మెదక్, రాజన్నసిరిసిల్లా, సంగారెడ్డి జిల్లాలకు చెందిన మహిళలు భారీగా జాతరకు వస్తున్నారు.



నంది విగ్రహానికి మొక్కుతున్న భక్తులు



వాగులో స్నానం చేస్తున్న భక్తులు



రంగుల రాట్నం వద్ద సందడి

తాను వేసిన వలే చిక్కుకొని

చేపల వేటకు వెళ్లి ఇద్దరు మృతి



కేశవులు మృతదేహం

సంగారెడ్డి టౌన్: చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన సంగారెడ్డి మండలంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై వినయ్ కుమార్ కథనం ప్రకారం.. కులబ్‌గూర్ గ్రామానికి చెందిన బోయిని కేశవులు(43) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం గ్రామస్తులైన దూదేకుల హాజీ, మహమ్మద్ రఫీ, షేక్ మాక్బుల్‌తో కలిసి చేపలు పట్టేందుకు గ్రామ శివారులోని నల్ల చెరువుకు వెళ్లాడు. చెరువులోకి దిగిన కేశవులు కాళ్లకు వల చుట్టుకోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య బోయిని నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సిద్దిపేటఅర్బన్: చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి నీటిలో మునిగి మృతి చెందిన ఘటన సిద్దిపేట అర్బన్ మండలంలో చోటు చేసుకుంది. సిద్దిపేట త్రీటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉండే కొండపాక రాములు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం కిష్టసాగర్ శివారులోని వడిశెల కుంట వద్ద చేపలు పట్టడానికి వెళ్లి రాత్రి అయినా ఇంటికి రాలేదు. శుక్రవారం ఉదయం చిన్న కుమారుడు శేఖర్ వడిశెలకుంట వద్దకు వెళ్లి చూడగా కట్టపై బట్టలు, ఫోన్, చెప్పులు కనిపించడంతో పాటు నీటిలో రాములు మృతదేహం తేలి ఉంది. గాలం చేతికి చుట్టుకొని నీటిలో మునిగి మృతి చెందినట్లు మృతుడి పెద్ద కుమారుడు కనకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

హత్యా..? సజీవ దహనమా..?

- గుర్తు తెలియని మృతదేహం లభ్యం
- సిద్దిపేట మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామ శివారులో ఘటన

సిద్దిపేటరూరల్: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామ శివారులో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రాఘవాపూర్ శివారు వద్ద గల ఓ రైతు వ్యవసాయ పొలం వద్ద గొర్రెల కాపరి గొర్రెలను మేపుకుంటూ వెళ్తున్నాడు. అక్కడ గడ్డిలో కాలిపోయిన మనిషి మృతదేహం గుర్తించి స్థానిక రైతులకు సమాచారం అందించాడు. అక్కడికి చేరుకున్న రైతులు గ్రామస్తులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. ఏసీపీ సురేందర్ రెడ్డి, సీఐ శ్రీను, ఎస్‌ఐ కిరణ్‌రెడ్డి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌కు సమాచారం ఇవ్వగా వారు వచ్చి మృతదేహంపై షర్ట్, ప్యాంట్, టవల్, జేబులో దొరికిన తాళం చెవి, చేతి వేళ్ల గుర్తులను సేకరించారు. మృతదేహం కాలిపోయి ఉండడంతో ఎవరైనా హత్య చేసి కాల్చివేశారా? లేక బతికి ఉండగానే సజీవదహనం చేశారా? అని సందేహాలు నెలకొన్నాయి. సీసీ కెమెరాలు, ఘటనా స్థలం వద్ద దొరికిన మద్యం సీసాలు, చేతి వేళ్ల గుర్తులను ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన వివరాల మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ కిరణ్‌రెడ్డి తెలిపారు.



వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం బృందం

బాలిక మృతదేహంతో నిరసన

చేగుంట(తూప్రాన్): పెళ్లి అయిన యువకుడితో మాట్లాడుతుందని బాలికను మందిలించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడింది. దీనికి ఆ యువకుడే కారణమని బాలిక బంధువులు మృతదేహంతో అతడి ఇంటి ఎదుట నిరసన వ్యక్తం చేసిన ఘటన శుక్రవారం పోతాన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, మృతురాలి బంధువుల వివరాల ప్రకారం.. పోతాన్‌పల్లి గ్రామానికి చెందిన ఓ బాలిక (17) హైదరాబాద్ తుకారం గేటు ఏరియాలో అమ్మమ్మ ఇంటివద్ద ఉంటూ ఇంటర్ చదువుతోంది. అదే గ్రామానికి చెందిన ఓ పెళ్లియిన యువకుడితో ఫోన్‌లో మాట్లాడుతుండేది. 25 రోజుల క్రితం ఇరు కుటుంబీకులు ఇద్దరినీ హెచ్చరించారు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక బుధవారం హైదరాబాద్‌లోని తుకారంగేట్ వద్ద ఆత్మహత్యకు పాల్పడింది. దీనికి యువకుడే కారణమని అతడి ఇంటి వద్ద బాలిక బంధువులు నిరసన వ్యక్తం చేశారు. కుటుంబీకులంతా ఊరి నుంచి పారిపోగా మృతురాలి బంధువులు శుక్రవారం చేగుంట పోలీసులను ఆశ్రయించారు. హైదరాబాద్‌లోనే కేసు నమోదైనందున ఇక్కడ మళ్లీ కేసు నమోదు చేయలేమని ఎస్‌ఐ హరీశ్ పేర్కొన్నారు.

జాతరకొచ్చి వాగులో గల్లంతు

- స్నానం చేస్తుండగా కొట్టుకుపోయిన వ్యక్తి
- లభించని ఆచూకీ
- మాఘ అమావాస్య రోజున విషాదం

మిరుదొడ్డి(దుబ్బాక): మాఘ అమావాస్య రోజున విషాదం చోటు చేసుకుంది. దైవదర్శనం కోసం వచ్చి వాగులో స్నానం చేయడానికి వెళ్లిన వ్యక్తి కుటుంబ సభ్యులు చూస్తుండగానే నీటిలో కొట్టుకుపోయాడు. ఈ విషాదకర ఘటన మండల పరిధిలోని మిరుదొడ్డి, అల్వాల్ శివారులో ఉన్న కోదండరాముడి ఆలయం సమీపంలో చోటు చేసుకుంది. గల్లంతైన వ్యక్తి కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. మిరుదొడ్డి అల్వాల్ శివారులోని కోదండరాముడి సన్నిధిలో మాఘ అమావాస్య సందర్భంగా శుక్రవారం జాతర సాగనుంది. మిరుదొడ్డికి చెందిన మద్దెల స్వామి (41) సౌమ్య దంపతులు తొమ్మిదేళ్లలోపు ఇద్దరు కుమారులు రాకేశ్, రామ్‌చరణ్‌లతో కలిసి కోదండరాముడి దైవ దర్శనం కోసం వచ్చారు. ఈ క్రమంలో ఇటీవల మల్లన్న సాగర్ ప్రాజెక్టు నుంచి కూడవెల్లి వాగులోకి నీటిని విడుదల చేయడంతో కోదండరాముడి ఆలయం ఎదురుగా ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. స్వామి కూడవెల్లి వాగులో కుటుంబ సభ్యులతో కలిసి మాఘ స్నానానికి ఉపక్రమించారు. ఇంతలో వాగు ఉధృతి పెరిగి స్వామి నీళ్లలో కొట్టుకుపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు కాపాడడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న మిరుదొడ్డి పోలీసులు, దుబ్బాక సీఐ శ్రీనివాస్, తహసీల్దార్ గోవర్ధన్ వచ్చి ఐదుగురు గజ ఈతగాళ్లతో వెతికించారు. సాయంత్రం అయినా స్వామి ఆచూకీ లభించలేదు. కళ్లెదుటే స్వామి కొట్టుకుపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.



మద్దెల స్వామి



ఘటనా స్థలంలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు

క్లుప్తంగా

తంజీమ్ ఎన్నికలపై ఘర్షణ



సూఫియా మసీద్ వద్ద రెండు వర్గాల వారితో మాట్లాడుతున్న పోలీసులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తంజీమ్ ఎన్నికలు రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. శుక్రవారం మధ్యాహ్నం సూఫియా మసీద్‌లో నమాజ్‌లో పాల్గొన్న తంజీమ్ కార్యవర్గం, మరో వర్గం సభ్యులు బాహాబాహికి దిగారు. ఈ విషయం తెలుసుకున్న పోలీస్‌లు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని, లాఠీచార్జీ చేసి రెండు వర్గాలను చెదరగొట్టారు. ఇరువర్గాల పరస్పరం ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భారతి సిమెంట్‌కు తిరుగు లేదు



భారతి అల్ట్రా సిమెంట్‌పై అవగాహన కల్పిస్తున్న మేనేజర్ సునీల్

దౌల్తాబాద్(దుబ్బాక): భారతి సిమెంట్ వ్యాపారంలో, నిర్మాణంలో తిరుగులేనిదని టెక్నికల్ సర్వీసెస్ మేనేజర్ సునీల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ ధనలక్ష్మీ ట్రేడర్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను విడుదల చేసిందన్నారు. వికాట్ గ్రూప్ కంపెనీ ప్రపంచంలో 12 దేశాలలో విస్తరించిందన్నారు. ఇతర సిమెంట్‌లతో పోలిస్తే దృఢత్వంతో పాటు నిర్మాణం చాలా వేగవంతగా పూర్తవుతుందన్నారు. కార్యక్రమంలో రాజు, సీనియర్ ఆఫీసర్ ప్రశాంత్, టెక్నికల్ సర్వీసెస్ డీలర్ దేవేందర్, కరుణాకర్, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

పథకాల అమలుపై కేంద్ర బృందం ఆరా



వర్మి కంపోస్ట్ తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

నంగునూరు(సిద్దిపేట): కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులను పరిశీలించేందుకు శుక్రవారం కేంద్ర బృందం సిద్దన్నపేటను సందర్శించింది. సభ్యులు సమీర్ కుమార్, సమాచారశాఖ అధికారి అశోక్ కుమార్‌తోపాటు పలువురు అధికారులు వర్మి కంపోస్ట్, కిసాన్ సమ్మాన్ నిధి, ఐసీడీసీ, ఉపాధి హామీ పథకం, నర్సరీ, మిషన్ భగీరథ, వర్మీ కంపోస్ట్ తయారీని పరిశీలించారు. అనంతరం గ్రామంలో చేపట్టిన పనులు, రికార్డులను తనిఖీ చేశారు.

పీవీకి భారతరత్న ప్రకటించడంపై హర్షం

పెద్దశంకరంపేట(మెదక్): మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడంపై బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. తెలుగుజాతి ముద్దు బిడ్డ పీవీ అన్నారు. ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్ కుమార్, క్రిష్ణ తదితరులున్నారు.

రికార్డుల పరిశీలన

తూప్రాన్: రైతులకు అందుబాటులో ఉన్న రైతు ఉత్పత్తిదారుల సంఘం లిమిటెడ్‌ను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ సంధ్యారాణి పేర్కొన్నారు. శుక్రవారం మల్కాపూర్ రైతు ఉత్పత్తిదారుల సంఘం లిమిటెడ్‌ను తనిఖీ చేశారు. ఫర్టిలైజర్ స్టాక్ వివరాలను వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తూప్రాన్ మండల వ్యవసాయ శాఖ అధికారి గంగుమల్లు, ఎఫ్‌పీఓ మేనేజింగ్ డైరెక్టర్ పంజాల ఆంజనేయులుగౌడ్, డైరెక్టర్లు స్వామి, శ్రీనివాస్, శేఖర్ పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ

ఇద్దరికి గాయాలు

రేగోడ్(మెదక్): ఎదుఱెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన రేగోడ్ మండలంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. తెలిసిన వివరాల ప్రకారం.. మండలంలోని టి.లింగంపల్లి గ్రామానికి చెందిన దిగంబర్, అల్లాదుర్గం మండలంలోని చేవెళ్ల గ్రామానికి చెందిన మల్లేషం ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాలు ఆర్.ఇటిక్యాల గ్రామ శివారులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇద్దరూ గాయాలపాలయ్యారు. వీరిని 108 వాహనంలో జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఎల్‌ఓసీ అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న బాలుడికి చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే సునీతారెడ్డి శుక్రవారం ఎల్‌ఓసీ అందజేశారు. మండల పరిధిలోని కొట్టాలకు చెందిన కేతవత్ గౌతం అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండగా చికిత్స నిమిత్తం రెండు లక్షల ఎల్‌ఓసీని హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో అందజేశారు.

పొగాకు సాగు.. లాభాలు బాగు

- ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి
- క్వింటాలుకు రూ.10 వేల నుంచి రూ.11వేలు ధర
- ఆసక్తి చూపుతున్న రైతులు

యాసంగిలో వరికి బదులుగా ఆరుతడి పంట సాగుచేయాలని రైతులు నిర్ణయించుకున్నారు. తక్కువ పెట్టుబడి, తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసుకునేందుకు అనుకూలమైన పంట పొగాకు. పొగాకు సాగులో మంచి లాభాలు వస్తుండటంతో రైతులు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రైవేటు కంపెనీతో సాగు ఒప్పందం కుదుర్చుకున్నారు. వచ్చే సీజన్ నాటికి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. సాగులో వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడి పొందొచ్చని చెబుతున్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు మండల కేంద్రంతోపాటు రామంచ, మాచాపూర్, మెట్‌పల్లి, గోనెపల్లితో పాటు పలు గ్రామాల్లో రైతులు పొగాకు సాగు చేస్తున్నారు. సుమారు 50 ఎకరాల్లో పొగాకు సాగు చేసేందుకు గాడ్ ఫ్రె ఫిలిప్స్ ఇండియా కంపెనీతో రైతులు ఒప్పందం కుదుర్చుకున్నారు. యాసంగి పంటల సాగులో వరికి బదులుగా ఆరుతడి పంట అయిన పొగాకు సాగు చేయాలని రైతులు ముందుకు వచ్చారు. పొగాకు సాగుకు నల్లరేగడి భూములతో పాటు ఎర్ర నేలల భూముల్లో మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది. తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేసే అవకాశం ఉంటంతో రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే సిద్దిపేట ప్రాంతంలో పొగాకు సాగుకు రైతులు ముందుకు వచ్చారు. వచ్చే సీజన్‌లో సాగు మరింత పెరిగే అవకాశం ఉన్నదని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.

మద్దతు ధర చెల్లింపు ఒప్పందం

ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కంపెనీ ఒప్పందం ప్రకారం రైతులకు క్వింటాల్‌కు రూ.10 నుంచి రూ. 11 వేలు మద్దతు ధర చెల్లించేందుకు కంపెనీలు రైతులతో ముందస్తుగా ఒప్పందం కుదుర్చుకుంటాయి. పొగాకు పంట సాగుకు ఆగస్టు నుంచి ఫిబ్రవరి వరకు వాతావరణం అనుకూలంగా ఉంటుంది. సాధారణంగా వరి పంట మాదిరిగానే వంద నుంచి 120 రోజుల్లో పొగాకు పంట చేతికి వస్తుంది. ఈ సాగుకు పెట్టుబడి తగ్గి ఆదాయం ఎక్కువగా ఉండటంతో ఎక్కువ ప్రాధాన్యం సంతరించుకుంది. అందుకుగాను ముందస్తుగా నర్సరీల్లో పొగాకు మొక్కలు పెంచి నాటుతారు. మార్చిలో కంపెనీలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాయి. ప్రకటించిన మద్దతు ధరకు రైతులు విక్రయించనున్నారు.



మాచాపూర్‌లో ఏపుగా పెరిగిన పొగాకు మొక్కలు



రామంచలో నర్సరీలో పెంచుతున్న పొగాకు మొక్కలు

పొగాకు సాగుపై అవగాహన

పొగాకు సాగుకు ముందుకు వచ్చిన రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మొదటి దశలో మొక్క కొనలు తుంచడం (టాపింగ్) చేయాలి. ఇలా చేయడం వల్ల అధిక దిగుబడులు పొందొచ్చు. పొగాకు పువ్వు తలను ఒంటరిగా తొలగించడం వంటివి చేయాలి. సాధ్యమైనంత వరకు విశాలమైన ఆకులు పొందడానికి ఈ టాపింగ్ చేయడం చాలా అవసరం.

– జయంత్ కుమార్, ఏఓ

'నిన్ను చేరాలని..' సాంగ్ ప్రోమో ఆవిష్కరణ



సాంగ్ ప్రోమోను ఆవిష్కరిస్తున్న కనకరాజు, శ్రీనివాస్, సంజీవరెడ్డి

సిద్దిపేటకమాన్: సిద్దిపేటకు చెందిన రాక్ ట్యూన్స్ ఆధ్వర్యంలో 'నిన్ను చేరాలని..' ప్రోమో సాంగ్‌ను టీహెచ్‌ఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు జువ్వన్న కనకరాజు, టీయూడబ్ల్యూజే జిల్లా సహాయ కార్యదర్శి రంగదాంపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు నాయిని సంజీవరెడ్డిలు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సిద్దిపేట రామునిపట్ల గ్రామానికి చెందిన వెంకటాపురం రాకేశ్ సారథ్యంలో రూపొందించినట్లు వారు తెలిపారు. సిద్దిపేట పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. స్థానిక యువకులు రూపొందించిన సాంగ్ మంచి ఆదరణ పొందాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో దర్శకత్వం, స్క్రీన్‌ప్లే ప్రశాంత్, నటులు అరవింద్, రీను, కాన్సెప్ట్, సాహిత్యం బొడ్డు గణేశ్, సంగీతం కృష్ణుడు, గాయకుడు రామ్ అద్నాన్, ఎడిటింగ్ ప్రవీణ్‌బుజ్జి, సాంకేతిక విభాగం మద్దతు వెంకట్, అభి, అనిల్ పాల్గొన్నారు.

విరాళం అందజేత



కరణ్ గజేంద్ర మహారాజ్‌కు స్వాగతం పలుకుతున్న జైపాల్‌రెడ్డి, నాయకులు

జహీరాబాద్ టౌన్: మహారాష్ట్రంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన పండరీపురంలో కరణ్ గజేంద్ర మహారాజ్ నిర్మిస్తున్న ఆశ్రమానికి మాజీ డీసీసీబీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకులు జైపాల్‌రెడ్డి రూ.5లక్షల విరాళం అందజేశారు. కరణ్ గజేంద్ర మహారాజ్ ఆధ్వర్యంలో భక్తులు పండరీపురానికి పాదయాత్రగా బయలుదేరగా జైపాల్‌రెడ్డి శుక్రవారం కర్నాటక రాష్ట్రంలోని ఏకాంబలో కరణ్ గజేంద్ర మహారాజ్‌ను కలిసి వారికి ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో జహీరాబాద్ నియోజకవర్గం బీజేపీ నాయకులు బుచ్చిరెడ్డి, శివాజీ పాటిల్, మోహన్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్ స్వామి, శంకర్, హన్, ఆఫ్సర్ దిల్దార్, సాకేత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చింది రూ.561 కోట్లే..

- యాసంగి పంట రుణ లక్ష్యం రూ. 1,532 కోట్లు
- లక్ష్యం చేరుకోని బ్యాంకర్లు
- సీజన్ ప్రారంభమై రెండు నెలలు దాటినా నామమాత్రంగానే వితరణ
- వానాకాలం సీజన్‌లోనూ ఇదే పరిస్థితి
- పంట పెట్టుబడి కోసం రైతుల అవస్థలు

వికారాబాద్: పంట రుణాల టార్గెట్‌ను పూర్తి చేయడంలో బ్యాంకర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. యాసంగి సీజన్ ప్రారంభమై రెండు నెలలు దాటినా సగం రుణాలు కూడా ఇవ్వలేదు. వానాకాలం సీజన్‌లోనూ ఇదే పంథా కొనసాగించారు. పంట పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం ఎకరాకు ఇచ్చే రూ. 5వేలు ఏ మూలకు సరిపోవడంలేదు. ఈసారి రైతు బంధు డబ్బు కూడా అందరి ఖాతాల్లో జమకాలేదు. దీంతో అన్నదాతలు పంట రుణం కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

అయోమయంలో అన్నదాత

జిల్లాలో 2.5లక్షల రైతులు ఉండగా 5.88లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. యాసంగి సీజన్‌లో 1.5 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగుచేస్తుంటారు. రైతులు సీజన్ ప్రారంభమై రెండు నెలలు దాటినా బ్యాంకర్ల నుంచి రుణాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో డబ్బు కోసం వడ్డీ వ్యాపారుల తలుపు తడుతున్నారు. బ్యాంకర్లు పంట రుణాలు ఇస్తారా? ఇవ్వరా? అనే దానిపై రైతులకు క్లారిటీ లేకుండా పోయింది. పంట రకాలను బట్టి ఒక్కో ఎకరాకు రూ. 30 వేల నుంచి రూ. లక్ష వరకు పెట్టుబడి అవుతుండగా సాగు సాయం పేరుతో ప్రభుత్వం ఇచ్చే రూ. 5వేలు ఏ మాత్రం సరిపోవడం లేదని రైతులు అంటున్నారు.

లక్ష్యం చేరుకోవడంలో విఫలం

గృహ, వాహన, వ్యక్తిగత రుణాల విషయంలో లక్ష్యానికి మించి ఇచ్చే బ్యాంకర్లు పంట రుణాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రైతులకు అరాకొరా రుణాలు కూడా ఇవ్వడం లేదు. జిల్లా వ్యాప్తంగా వివిధ బ్యాంకుల్లో 1,07,114 రైతు ఖాతాలు ఉన్నాయి. వీటిలో 83,136 మంది రైతులకు రుణాలు ఇచ్చారు. వానాకాలంలో రూ. 1,550 కోట్ల రుణం ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా సీజన్ ముగిసిన నాటికి రూ. 1,225 కోట్ల రుణాలే ఇచ్చారు. ఇక యాసంగి పంట రుణాల విషయంలో రూ. 1,532 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకు కేవలం రూ. 561 కోట్లు మాత్రమే ఇచ్చారు. ఇక దీర్ఘకాలిక రుణాల విషయంలో బ్యాంకర్లు మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

టార్గెట్ పూర్తి చేస్తాం

వానాకాలం పంట రుణాల లక్ష్యం పూర్తి కాని మాట వాస్తవమే. అయితే యాసంగి సీజన్ ప్రారంభమైనందున త్వరలో రైతులకు రుణాలు ఇచ్చే ప్రక్రియను ప్రారంభిస్తాం. యాసంగికి సంబంధించి బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి రుణ ప్రణాళిక సిద్ధం చేశాం. సకాలంలో రుణాలు ఇవ్వాలని కలెక్టర్ బ్యాంకర్లకు సూచించారు. యాసంగి పంట రుణాల పంపిణీ టార్గెట్‌ను పూర్తి చేస్తాం.

– రాంబాబు, లీడ్ బ్యాంక్ మేనేజర్

కేతకీలో మాఘ అమావాస్య పూజలు



క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు



పూజలు అందుకుంటున్న అమ్మవారు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన కేతకి సంగమేశ్వర ఆలయంలో శుక్రవారం మాఘ అమావాస్య పూజలు వైభవంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ ఆవరణలోని అమృతగుండంలో పుణ్య స్నానాలు ఆచరించి, జలలింగానికి పూజలు చేశారు. అనంతరం గర్భగుడిలోని పార్వతీపరమేశ్వరులను దర్శించుకున్నారు. క్యూలైన్లు, పార్కింగ్, తాగునీరు, గదుల నిర్వహణ సరిగా లేకపోవటంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా స్త్రీ శిశు, సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ అధికారి బ్రహ్మాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంఘిక, ఆర్థిక సాధికారత రంగాల్లో అసాధారణమైన విశిష్ట సేవలందించిన మహిళా సాధకులను అవార్డులతో సత్కరించనున్నట్లు చెప్పారు. ఇందుకోసం ఆసక్తి, అర్హత గల మహిళలు ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తులను సంబంధిత వెబ్‌సైట్ ద్వారా సమర్పించవచ్చని పేర్కొన్నారు.

వీఆర్‌ఓకు కారాగార శిక్ష

బెజ్జంకి(సిద్దిపేట): ఉమ్మడి బెజ్జంకి మండలంలోని గునుకుల కొండాపూర్‌లో వీఆర్‌ఓగా పని చేసిన లింగంపెల్లి శ్రీనివాస్‌కు కారాగారా శిక్ష విధించినట్లు రాష్ట్ర యాంటీ కరప్షన్ బ్యూరో శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. అవినీతి నిరోధక శాఖ కేసులో 1988 యూఎస్ 7 శిక్షార్హమైన నేరానికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, యూఎస్ 13(1) (డీ) ఆర్‌బైడబ్ల్యూ 13(2) శిక్షార్హానికి నాలుగేళ్ల కఠిన కారాగార శిక్ష , రూ.10 వేల జరిమానా విధిస్తున్నట్లు కరీంనగర్ ఎస్‌పీఈ, ఏసీబీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కుమార్ వివేక్ తీర్పునిచ్చారు. గునుకుల కొండాపూర్‌కు చెందిన బాధితుడు పట్టాదారు పాస్ బుక్, టైటిల్ డీడ్, మోటేషన్ ప్రొసిడింగ్‌ల విషయమై లంచంగా అడిగారని అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేరారోపణలపై శిక్ష విధించారు.

క్రషర్, క్వారీలను నిలిపివేయాలి

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని మాదారం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న కంకర క్రషర్స్, క్వారీలను వెంటనే నిలిపివేయాలని కోరుతూ సెంట్రల్‌మైన్స్ సేఫ్టీ డిప్యూటీ డైరక్టర్ ప్రేమ్‌కుమార్, రాష్ట్ర సైన్స్ అండ్ జువాలజీ డైరక్టర్ సుశీల్‌కుమార్, రాష్ట్ర పీసీబీ చైర్మన్ రాజీవ్‌శర్మకు మాదారం గ్రామస్తులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసినవారిలో విజయ్‌గౌడ్, సుదర్శన్, రమణసింగ్, బాలేష్, గణేష్, వెంకటేశ్‌గౌడ్, రమేష్, నాగరాజు, బాలరాజు, పాండు, సంతోష్, నవీన్‌గౌడ్, అనిల్ పాల్గొన్నారు.

మానిటరింగ్ కమిటీ సమావేశం

మెదక్: మెదక్ కోర్టు ప్రాంగణంలో శుక్రవారం మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద సూచనల మేరకు ఈ సమావేశం నిర్వహించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ జితేందర్ తెలిపారు. ఈ సమావేశంలో మానిటరింగ్ కమిటీ సభ్యులు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్, అడ్వకేట్స్, ప్యానల్ లాయర్స్‌కు వారి వారి విధులు తదితర వాటిపై సూచనలు అందజేశారు. సమావేశంలో మానిటరింగ్ కమిటీ మెంబర్ పోచయ్య ఇతర న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హిందూ వాహిని సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఛత్రపతి శివాజీ విగ్రహ పునఃప్రతిష్ఠ వాల్‌పోస్టర్‌ను శుక్రవారం హిందూ వాహిని సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 19వ తేదీన శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా శివాజీ విగ్రహ పునఃప్రతిష్ఠతో పాటు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హిందూ వాహిని రాష్ట్ర సహసంయోజక్ శివాజీ గణేష్, హిందూ వాహిని సిద్దిపేట జిల్లా సంయోజక్ బస్వరాజు సత్యం, సహసంయోజక్ బండి కిరణ్ కుమార్, జిల్లా విధి ప్రముఖ్ ప్రదీప్ కుమార్, సహవిధి ప్రముఖ్ మధుసూదన్ రెడ్డి, జిల్లా సంపర్క ప్రముఖ్ రాజు, పరశురాములు, సిద్దిపేట పట్టణ సంయోజక్ లక్ష్మణ్, సహ సంయోజక్ అజయ్, పట్టణ సంపర్క ప్రముఖ్ రాజు, సిద్దిపేట అర్బన్ మండల సంయోజక్ మాధవ రెడ్డి, సహసంయోజక్ వీరేశం పాల్గొన్నారు.


అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్‌అర్బన్/తాండూరు: తాండూరు లోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అవుట్ సో ర్సింగ్ ప్రాతిపదికన వివిధ కేటగిరీల పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం విజయకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాండూరులో నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్ 2 పోస్టులు ఉండగా పోస్ట్ గ్రాడ్యుయేషన్, డిప్లమా అండ్ కంప్యూటర్ అప్లికేషన్, బ్యాచిలర్ ఇన్ కంప్యూటర్ సైన్స్ విద్యార్హత కలిగిన వారు అర్హులని తెలిపారు. రికార్డ్ అసిస్టెంట్ 2 పోస్టులు, హౌస్ కీపర్ నాలుగు పోస్టులకు డిగ్రీ అర్హత, అసిస్టెంట్ లైబ్రరీ పోస్టుకు డిగ్రీ లేదా డిప్లమా ఇన్ లైబ్రరీ సైన్స్ చదివి ఉండాలన్నారు. ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు 6, ల్యాబ్ అటెండెంట్ 5, లైబ్రరీ అటెండెంట్ 3 పోస్టుల కు పదో తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని తెలిపారు. హెవీ వెహికల్ డ్రైవర్ ఒక పోస్టుకు పదో తరగతి చదివి హెవీ వెహికల్ లైసెన్స్ ఉండాలని, మరో డ్రైవర్ పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు ఫోర్ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని తెలిపారు. ఐటీఐ ఎలక్ట్రానిక్స్ లేదా డిప్లమా ఇన్ ఎలక్ట్రానిక్స్ ఉత్తీర్ణత కలిగిన వారికి ఒక పోస్టు ఉన్నందున అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 18నుంచి 43 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లతో రెండు జతల దరఖాస్తులను ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు తాండూరు కళాశాలలో సమర్పించాలని తెలిపారు.

జీఓ 69కి జీవం

కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకానికి శ్రీకారం

- రూ.2,945 కోట్లు మంజూరు
- 3 నియోజకవర్గాల్లో 1.5లక్షల ఎకరాలకు సాగునీరు
- ప్రాజెక్టు నిర్మాణానికి పాలనా అనుమతులు



జూరాల ప్రాజెక్టు

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జీఓ నంబర్ 69కు జీవం పోశారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేసింది. బీమా ఎత్తిపోతల ద్వారా కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లోని లక్షా 5వేల ఎకరాలకు సాగునీరు, 5లక్షల 50వేల మందికి తాగునీరు అందించాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. 2014లో రాష్ట్ర విభజన జరిగి టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాన్ని పక్కన పెట్టారు. కేసీఆర్ ప్రభుత్వం 69 జీఓను అమలు చేయకుండా అడ్డుకున్నారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని తెరపైకి తెచ్చారు. ఈ ప్రాంతానికి మూడు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీశైలం నుంచి చివరి ఆయకట్టు అయిన కొడంగల్‌కు సాగునీరు రాదని కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతల పథకం జలసాధన సమితి సభ్యులు ఇన్నాళ్లు పోరాటం చేశారు. రేవంత్‌రెడ్డి కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్న 2014 - 2018 వరకు పలుమార్లు ఈ పథకాన్ని అమలు చేయాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై పోరాటం చేశారు. అయినా పాలకులు పట్టించుకోలేదు. ఎట్టకేలకు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 2024లో ఈ పథకానికి ప్రాణం పోశారు. పథకం అమలుకు రూ.2945 కోట్లు మంజూరు చేశారు. 3 నియోజకవర్గాల్లో లక్షా 5వేల ఎకరాలకు సాగునీరు, 5లక్షలా 50వేల మందికి తాగునీరు అందించడానికి వీలుగా ప్రాజెక్టు నిర్మించాలని పరిపాలనా అనుమతులు జారీ చేశారు.

నాలుగు రిజర్వాయర్లు

మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల మీదుగా కృష్ణానది ప్రవహిస్తూ తెలంగాణలో నారాయణపేట జిల్లా కృష్ణా మండలంలోకి ప్రవేశిస్తుంది. కృష్ణానదిపై తెలంగాణలో తొలి ప్రాజెక్టు జూరాల. జూరాల నుంచి నికర జలాలతో మూడు నియోజకవర్గాలకు సాగు, తాగునీరు ఇవ్వాలని ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బూత్‌పూర్ రిజర్వాయర్ నుంచి నాలుగు దశల్లో ఎత్తిపోతల ద్వారా సాగు నీరు సరఫరా చేయనున్నారు. ఊట్కూర్, జాజాపూర్, జయమ్మ చెరువు, కానుకుర్తి దగ్గర రిజర్వాయర్లు నిర్మిస్తారు. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా ఊట్కూర్, జాజాపూర్, జయమ్మ చెరువు, కానుకుర్తి, లక్ష్మీపూర్, ఈర్లపల్లి, దౌల్తాబాద్, హస్నాబాద్, కొడంగల్, బొంరాస్‌పేట చెరువులను కాకరవాణి ప్రాజెక్టును నింపి ఆయకట్టు భూములకు సాగునీరు వదులుతారు.

పరిపాలనా అనుమతులు మంజూరు

కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రేవంత్ సర్కార్ పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి రాహుల్ బొజ్జా జీఓ నంబర్ 14 విడుదల చేస్తూ పరిపాలన అనుమతులు ఇచ్చారు. ఎత్తిపోతల పథకానికి రూ.2,945 కోట్లకు అనుమతి లభించింది. ఈ నిధులతో సర్వే, సమగ్ర అధ్యయనం, డిజైన్, భూసేకరణ, పర్యవేక్షణ తదితర పనులను చేయాల్సి ఉంటుంది.

ముందుకు సాగని 'పాలమూరు'

పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వల్ల కొడంగల్ నియోజకవర్గానికి ఉపయోగం లేదని జలసాధన సమితి సభ్యులు అంటున్నారు. శ్రీశైలం నుంచి మూడు వందల కిలోమీటర్ల దూరం సాగునీరు రావడం కష్టమన్నారు. పాలమూరు పథకంలో కొడంగల్ ప్రాంతం చివరి ఆయకట్టు అవుతుంది కాబట్టి సాగునీరు అందే అవకాశం లేదని చెబుతున్నారు. నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతలతోనే సాగునీరు తాగునీరు వస్తుందని నిధుల వ్యయం కూడా తక్కువగా ఉంటుందని అంటున్నారు. నారాయణపేట, మక్తల్, కొడంగల్ నియోజకవర్గాలకు మేలు జరగనుందని జలసాధన సమితి సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.